# కాంగ్రెస్ దొంగ హామీలను నమ్మొద్దు

## వికారాబాద్ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



రాంపూర్ గ్రామంలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

కోట్‌పల్లి, అక్టోబర్ 19: కాంగ్రెసోళ్లు చెబుతున్న దొంగ హామీలను ప్రజలు నమ్మవద్దని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. గురువారం మండలంలోని బీరోల్, జిన్నారం, ఎన్కెపల్లి, రాంపూర్, ఎన్నారం, కొత్తపల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెసోళ్లకు ప్రజల అభివృద్ధి సంక్షేమంపై శ్రద్ధ లేదన్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు వారు ప్రయత్నిస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తక్కువ కాలంలోనే ప్రజలకు అన్ని విధాలుగా సంక్షేమ పథకాలను అందించిందన్నారు. కొత్త మ్యానిఫెస్టోను కూడా తూచా తప్పకుండా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఉమాదేవి, పార్టీ మండల అధ్యక్షుడు అనిల్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వికారాబాద్, అక్టోబర్ 18 : బీఆర్‌ఎస్ పార్టీ చేపట్టిన పథకాలు ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతున్నాయని ఎమ్మెల్యే ఆనంద్ సతీమణి డాక్టర్ సబిత తెలిపారు. గురువారం వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మద్గుల్ చిట్టంపల్లి, గుడుపల్లి, సుభాష్‌నగర్ కాలనీల్లో ప్రచారం చేశారు. మహిళలను ఆప్యాయంగా పలుకరించి, బొట్టుపెట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఆమె వెంట పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ముత్యంరెడ్డి, వైస్ చైర్మన్ పాండు, కౌన్సిలర్లు గోపాల్, సంతోష, ప్రవళిక, పావని, అనంత్‌రెడ్డి, కృష్ణ, కృష్ణారెడ్డి, నాయకులు విజయ్‌కుమార్, అనంత్‌రెడ్డి, మల్లేశం, షకీల్ తదితరులు పాల్గొన్నారు.



సభకు ర్యాలీగా వస్తున్న ప్రజలు



జిన్నారం గ్రామంలో బతుకమ్మ ఆడుతూ స్వాగతం పలుకుతున్న మహిళలు



వికారాబాద్: ఇంటింటి ప్రచారం చేస్తున్న సబితా ఆనంద్

## అశ్వవాహనంపై వేంకటేశ్వర స్వామి



వికారాబాద్, అక్టోబర్ 19 : పట్టణంలోని వేంకటేశ్వరాలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగ జరుగుతు న్నాయి. ఇందులో భాగంగా గురువారం ఆలయంలో స్వామివారి కల్యా ణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. శ్రీ వారిని అశ్వ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి అధ్యక్షుడు పగిడాల లక్ష్మీనారాయణ, సభ్యులు రవీందర్‌రెడ్డి, చండీశ్వర్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, పర్మారెడ్డి, లక్ష్మారెడ్డి, రాము, మన్‌మోహన్‌రెడ్డిలు, మోనిగారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## గరుడ వాహనంపై అనంతపద్మనాభస్వామి



వికారాబాద్, అక్టోబర్ 19 : దసరా ఉత్సవాలలో భాగంగా వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి అనంతపద్మనాభస్వామి దేవాలయంలో గురువారం స్వామివారు గరుడ వాహనంపై ఊరేగారు. భక్తులు స్వామి వారి పల్లకి మోస్తూ ఆలయ పురవీధుల్లో తిప్పారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఎన్.పద్మనాభం, ఆలయ ఈవో టి.నరేందర్ పాల్గొన్నారు.

## పూజా సామగ్రి విక్రయానికి వేలంపాట

వికారాబాద్, అక్టోబర్ 19 : అనంతపద్మనాభస్వామి దేవాలయంలో ఒక నెల పాటు కొబ్బరికాయలు, దీపారాధన సామగ్రిని అమ్ముకోవడానికి గురువారం ఆలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించినట్లు ఆలయ ధర్మకర్త పద్మనాభం, ఈవో నరేందర్‌లు తెలిపారు. నవంబర్ 14 నుండి డిసెంబర్ 13వరకు కార్తీక మాసం జాతర సందర్భంగా కొబ్బరికాయలు, దీపారాధన సామగ్రిని అమ్ముకునుటకు వేలం పాట నిర్వహించడం జరిగిందన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా వాసి సత్యనారాయణ కొబ్బరికాయల వేలం పాట పాడి రూ. 3.66లక్షలకు దక్కించుకున్నాడు. దీపారాధన రూ. 92వేలు, మొత్తం రూ.4.58లక్షలకు అధికంగా వేలం పాట పాడి దక్కించుకున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ మధుబాబు సమక్షంలో వేలం పాట నిర్వహించడం జరిగిందని తెలిపారు.

# ప్రచార కార్యక్రమాలకు అనుమతి తప్పనిసరి

**సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు చేయొచ్చు**

**అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

కొడంగల్, అక్టోబర్ 19 : అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల కార్యక్రమాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. గురువారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీలతో సమావేశం ఏర్పాటు చేసి అధికారులు, పార్టీ నాయకులకు ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు, మీటింగ్‌లు, ర్యాలీ తదితర వాటికి తప్పకుండా సువిధా యాప్‌లో 48గంటల ముందు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పర్మిషన్ పొందిన తరువాతే ఎన్నికల కార్యక్రమాలను చేపట్టుకోవాలని పేర్కొన్నారు. వాహనాల పర్మిషన్‌కు సంబంధించి నియోజకవర్గం మొత్తంగా కావాలా, లేదా మండలం వరకు మాత్రమే కావాలని స్పష్టంగా సూచించాలని తెలిపారు. మండలం వరకు పర్మిషన్ తీసుకొంటే ఆ వాహనం ఆ మండలంలోనే తిరగాల్సి ఉంటుందని, నియోజకవర్గస్థాయి అయితే నియోజకవర్గం మొత్తం తిరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జిల్లా పరిధిలో వాహన పర్మిషన్ పొందాలంటే జిల్లా కేంద్రంలో అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. వాహన పర్మిషన్లకు ప్రతి వాహనానికి ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండే విధంగా చూసుకోవాలన్నారు. వాల్ పెయిటింగ్, వాల్‌పోస్టర్‌లకు ఎటువంటి అనుమతి లేదని సూచించారు. హోర్డింగ్‌లు, బ్యానర్లు వంటి వాటిని ఏర్పాటు చేసుకోవాల్సి వస్తే ఇంటి యజమాని పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తును తహసీల్దార్లకు అందించి అనుమతి పొందాలని తెలిపారు. పబ్లిక్ స్థలాల్లో ఎటువంటి ప్రచార పరికరాలను ఏర్పాటు చేయవద్దన్నారు. ఏదైనా ఘటనలు తలెత్తినా సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదులు అందించవచ్చన్నారు. ఎన్నికల నియమనిబంధలను పాటించాల్సి ఉంటుందని, ఏదైనా మార్పులు చేర్పులు ఉంటే వాటిని అనుసరించే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. సమావేశంలో కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, కోస్గి, మద్దూర్ మండలాల తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో పాటు ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# బీఆర్‌ఎస్ తోనే అన్ని వర్గాల సంక్షేమం



మర్పల్లి, అక్టోబర్ 19 : అన్ని వర్గాల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ మ్యానిఫెస్టోను రూపకల్పన చేశారని జడ్పీటీసీ మధుకర్ అన్నారు. గురు వారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో మర్పల్లి టౌన్ బీఆర్‌ఎస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గ్రామాల్లో సీఎం కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభి వృద్ధి పథకాలను గ్రామస్తులకు వివరించాలన్నారు. మూడోసారి సీఎం కేసీఆర్‌ను, రెండోసారి ఎమ్మెల్యేగా ఆనంద్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుని మరింతఅభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్ర మంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్ గుప్తా, వైస్ ఎంపీపీ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గౌస్, బీఆర్‌ఎస్ టౌన్ ప్రెసిడెంట్ గఫార్, నాయకులు రాచయ్య, శ్రీకాంత్, వసంత్ కుమార్, రాజు పాల్గొన్నారు..

## దసరా ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్‌పర్సన్

వికారాబాద్, అక్టోబర్ 19 : విజయ దశమి పండుగ సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని ఆలపంల్లి బోనమ్మ ఆలయం వద్ద జరిగే జాతర ఏర్పాట్లను గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. విజయదశమి పండుగను మున్సిపల్ నిధులతో తగు ఏర్పాట్లు చేస్తున్నారు. శమీపూజ, రావణ దహనం ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. జాతరకు వేల సంఖ్యలో ప్రజలు తరలి వస్తారని, ఎక్కడ కూడా నిర్లక్ష్యం చేసి, అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట స్థానిక కౌన్సిలర్ రామస్వామి, పట్టణ అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు మేక చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.